క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

పెద్దాపురం(వీరులపాడు):వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రికార్డులను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆటోవాలాలు పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసు నమోదు చేయటంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, వాహనాల రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

24న దేవాయల భూముల కౌలు వేలం

భీమవరం(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈవో సీహెచ్ హరి దుర్గానాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు దేవాలయ ప్రాంగణంలో వేలం జరుగుతుందన్నారు. 9.46 సెంట్ల భూమికి ఒక సంవత్సర కాలానికి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. హెచ్చుపాటదారుగా నిలిచిన వారు వెంటనే కౌలు చెల్లించాలని చెప్పారు. గతంలో ఆలయానికి బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



నందిగామ: జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని పల్లగిరి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని విద్యార్థులు తెలిపారు.

లింగాలపాడులో పోలీసుల కవాతు



నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం పోలీసులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో నిత్యం పోలీసు కవాతు నిర్వహించడంతో పాటు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల మహోత్సవాలు జరగాలన్న సంకల్పంతో పోలీసులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నారాయణ వ్యాఖ్యలు శోచనీయం

జగ్గయ్యపేట అర్బన్: వయస్సు పెరిగినప్పటికీ సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ సభ్యతను కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడటం శోచనీయమని వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి లాహోరి బద్దూనాయక్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగ్గయ్యపేట పట్టణంలోని చారిత్రక జామియా మసీదు కమిటీ సభ్యుడు సయ్యద్ ఆలీ, జయంతిపురం పంచాయతీ మెంబరు దాసరి దాసు, మైనార్టీ యువ నాయకుడు అబ్దుల్ హకీం తదితరులతో కలసి మాట్లాడారు. నారాయణ సీపీఐ సిద్ధాంతాలను తుంగలో తొక్కాడని ధ్వజమెత్తారు. సీపీఐకి రాజీనామా చేసి టీడీపీలో చేరాలని సూచించారు.

నేడు లక్ష తమలపాకుల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం మందిరం క్షేత్ర పాలకుడు శ్రీ పసన్నాంజనేయ స్వామివారికి లోక కళ్యాణార్థం లక్ష తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు మందిర ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా వైశాఖి, శ్రీ కూర్మ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లోక హితం కోరుతూ క్షేత్రపాలక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకుల అర్చన జరుగుతుందన్నారు. లక్ష తమలపాకుల అర్చన కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేస్తారని తెలిపారు.



జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామంలో ఫారం పాండ్ పనులు చేస్తున్న కూలీలు



పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలలో పంటకాలువ పనులు చేస్తున్న కూలీలు

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

- పెరిగిన వేతనంతో కూలీల ఆనందోత్సాహం
- ఏప్రియల్ నుంచి రూ. 300 పెంపు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు, అమృత్ సరోవర్ ట్యాంక్, కాలువల అభివృద్ధి, డొంకరోడ్లు, ఫారం పాండ్‌లు నిర్మాణం, చెరువులు, చెక్‌డ్యాంలో పూడికతీత, బీడు భూముల అభివృద్ధి, పండ్ల తోటలు నిర్వహణ వంటి పనులు చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద కూలీలకు పనులు కల్పించి జీవనోపాధికి ఊతం ఇచ్చేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రియల్ నుంచి ఉపాధి కూలీలకు ఉన్న కనీస వేతనం రూ.272 నుంచి రూ.300 పెరిగింది. దీంతో ఒక్కో కూలీకి సగటున రూ.28 పెరిగినట్లు అయింది. జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి, బండిపాలెం గ్రామాల్లో చెక్ డ్యాం పనులు ఫారం పాండ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

39,968 మందికి జాబ్ కార్డులు....

మూడు మండలాల్లో 39,969 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. జగ్గయ్యపేట మండలంలో 15,689 మందికి జాబ్ కార్డులు ఉండగా 27,784 కూలీలకు, 6,26,661 పనిదినాలు కల్పించి రూ.16.08 కోట్లు వేతనాలు చెల్లించారు. పెనుగంచిప్రోలు మండలంలో 9,723 మందికి జాబ్ కార్డులు ఉండగా 16,018 మంది కూలీలకు 2,73,528 పని దినాలు కల్పించి రూ.662.66 లక్షలు చెల్లించారు. వత్సవాయి మండలంలో 14,557 మందికి జాబ్ కార్డులు ఉండగా 26,845 మంది కూలీలకు 2,24,626 పనిదినాలు కల్పించి రూ.596.04 లక్షలు వేతనాలు చెల్లించారు.

పెరిగిన వేతనంతో ఎంతో మేలు



ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఉదయం నుంచే పనులకు వెళుతున్నాం. ఉపాధి హామీ పథకంలో వేతనం పెరగడం వలన మాలాంటి కూలీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఏటా 100 రోజులు పని కల్పిస్తూ కనీస వేతనం అందిస్తున్న ప్రభుత్వాలకు రుణపడి ఉంటాం.

బి.విజయమ్మ, ఉపాధి కూలీ, బండిపాలెం

సగటు వేతనం వస్తుంది



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.28 పెరిగింది. దీని వల్ల కూలీల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. కూలీలు పనిచేసే దాన్ని బట్టి వారికి సగటు వేతనం వస్తుంది. మస్టర్ విధానంలో పలు సూచనలు కూడా ఇచ్చారు.

కె.సంతోష్, ఏపీవో, చిల్లకల్లు

సృజనకు పదును పెట్టేందుకే శిబిరాలు



కంచికచర్ల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



గ్రంథాలయంలో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు



పేట గ్రంథాలయంలో మెడిటేషన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంచికచర్ల: వేసవి సెలవులు బడి చదవులకు విరామం కావటంతో ఆటలకే పరిమితం కాకుండా పిల్లల సృజనకు పదును పెట్టేందుకు రాష్ట్ర పౌర గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశామని కృష్ణా జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి ఎంవీవీడీ నగేష్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో విజ్ఞాన, సాంస్కృతిక, సృజనాత్మకత పెంపొందించటమే లక్ష్యంగా ఈ శిబిరం ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండేందుకు వారికి వినోదం, విజ్ఞానం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకునేందుకు పుస్తకాలు చదివిస్తున్నామని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, యోగా వంటివి నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు, విశ్రాంత గ్రంథ పాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, నీలం సర్వేశ్వరరావు, ఎం కనకారావు, డాన్స్ మాస్టర్ నవీన్‌నాని, ఎం.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

మెడిటేషన్‌పై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆరవ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనంలో పొడుపు కథలు, సుమతీ శతకం పద్యాలు నేర్పించి విద్యార్థులతో చెప్పించారు. అనంతరం అనుమంచిపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ పీఈటీ మణిరత్నం మెడిటేషన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి చేయించారు. అలాగే చదరంగం ఏ విధంగా ఆడాలో నేర్పించారు. తరువాత చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యావతి పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ కల్యాణ మహోత్సవాలు



గ్రామంలో వేంచేసుకున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి బుధవారం ఇరుముడి సమర్పణ, అమ్మవారి ఎదురు కోలోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు యోగానంద చార్యులు, శ్రీధర్ చార్యులు ఆధ్వర్యంలో పలు పూజలు చేశారు. స్వామి వారి కల్యాణం సందర్భంగా స్వామివారిని , అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ వంశం పారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరా దత్ స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా కేసీపీ బాలా త్రిపుర సుందరి అమ్మవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈవో, హేమలత దేవి కేసీపీ ప్రతినిధి రామప్రసాద్, పెద్ద సంఖ్యల భక్తులు పాల్గొన్నారు.

వేదాద్రి (జగ్గయ్యపేట)



స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ఇరుముడులు సమర్పించేందుకు వచ్చిన దీక్షా స్వాములు



స్వామివారి దర్శనం కోసం వచ్చిన వంశం పారంపర్య ధర్మకర్త ఇందిరా దత్



బాలా త్రిపుర సుందరి దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం



రోగులకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

వైభవంగా లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు

నందిగామ: పల్లగిరి గుట్టపై వేంచేసియున్న రాజ్యలక్ష్మీసమేత లక్ష్మీనృసింహస్వామి వారి 32 వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం స్వామి వారికి పలు రకాల విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చందనంతో స్వామి వారిని అలంకరించి తులసీ దళార్చన నిర్వహించారు. మహోత్సవాలను పురస్కరించుకుని సుదర్శన నృసింహోమం నిర్వహించారు. రాత్రి సమయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చందన అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నారసింహుని కల్యాణం

మక్కపేట(వత్సవాయి): గ్రామ శివారులోని మూడు ఏనెల రోడ్డులో గుట్టపై కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాన్ని పురస్కరించుకుని గట్టును అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ లైట్లను అలంకరిచారు. దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. గ్రామానికి చెందిన భక్తులతోపాటు గోపినేనిపాలెం, తిరుమలగిరి, మంగొల్లు, చిల్లకల్లు, భీమవరం తదితర గ్రామానికి చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారి దత్తత ఆలయమైన శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారు, అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన మండపంపై స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలు నిలిపి ఆలయ ప్రధానార్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై వంశ పారంపర్య ధర్మకర్తలు, పలువురు దంపతులు కూర్చొన్నారు. కల్యాణానికి ఆలయ అధికారులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు దంపతులు, ఆలయ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) స్వామివారి కల్యాణం

ఘనంగా రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ 252వ జయంతి వేడుకలు బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. రాజా రామ్మోహన్ రాయ్ గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. ఆయన సతీసహగమన సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, నాగభూషణం, మాధవరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



నందిగామ : మండల పరిధిలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఈ నెల 27 వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఐదు రోజల పాటు విశేష పూజలు, రథోత్సవం, గ్రామశిలల బోనాలు, అమ్మవారికి గ్రామబోనాలు, దీవెన బండారు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సీతారామయ్య తెలిపారు. తిరునాళ్ల ఏర్పాట్లకు సంబంధించి దేవదాయ ధర్మాదాయ శాఖ విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ శాంతి కుమారి బుధవారం రాత్రి ఆలయాన్ని సందర్శించారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలని గ్రామస్తులకు సూచించారు. ఆమె వెంట పలువురు దేవదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేటూరి పాట తెలుగు సాహిత్యపు పూదోట



విజయవాడకల్చరల్: వేటూరి పాట తెలుగు సాహిత్యపు పూల తోట అని కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, సాంస్కృతిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాహితీవేత్త, పరిశోధకుడు, సినీ పాటల రచయిత వేటూరి సుందరరామ్మూర్తి విగ్రహం వద్ద ఆయన 14వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విగ్రహానికి నివాళి అందించిన అనంతరం గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని అన్నారు. వేటూరి సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ.. వేటూరి ఓ సీత కథతో సినీ రంగ ప్రవేశం చేశారని, 15 వేలకు పైగా పాటలను రచించారని తెలిపారు. వేటూరి చాలా రకాలైన పాటలు రాశారని సంప్రదాయ కవిత్వం దగ్గర నుంచి జానపద గీతాల వరకు ఆయన ముద్ర కనిపిస్తుందన్నారు. రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు 1994లో జాతీయ పురస్కారం లభించిందని తెలిపారు. వర్ధంతి కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు, చింతకాయల చిట్టిబాబు, చలపతిరావు, శ్యాం ప్రసాద్, ఆదిరాల జయప్రభ, ప్రిన్స్‌తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.